సాక్షి సిద్దిపేట

ఆదివారం । 4 । మే । 2025

నీ కడుపు సల్లగుండా

సండే స్పెషల్

వేసవి తాపం నుంచి ప్రజలను గట్టెక్కించేందుకు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా చలివేంద్రాలు వెలిశాయి. కొందరు కుటుంబీకుల జ్ఞాపకార్థం.. మరికొందరు సేవా దృక్పథంతో సొంత ఖర్చులతో ఏర్పాటు చేశారు. వేసవి ముగిసేవరకు ప్రజలకు మినరల్ వాటర్ అందజేస్తూ ప్రజల దాహార్తిని తీరుస్తున్నారు.

వివరాలు IIలో



న్యూస్‌రీల్

7 నుంచి ఆర్టీసీ కార్మికుల సమ్మె

హుస్నాబాద్: తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో సమ్మె సైరన్ మోగించేందుకు కార్మికులు సిద్ధమవుతున్నారని కరీంనగర్ రీజినల్ ఆర్టీసీ జేఏసీ చైర్మన్ ఎంపీ రెడ్డి తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ఆర్టీసీ కార్మికుల ప్రధాన సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 7వ తేదీ నుంచి కార్మికులు సమ్మె బాట పట్టనున్నట్లు వెల్లడించారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని, యూనియన్లను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కారుణ్య నియామకాలు చేపట్టిన వారిని రెగ్యులర్ పద్ధతిలో తీసుకోవాలన్నారు. ఉద్యోగ భద్రత కల్పించి, ఎలక్ట్రిక్ బస్సులను ప్రభుత్వమే కొనుగోలు చేసి ఆర్టీసీ సంస్థకు అప్పజెప్పాలన్నారు.

న్యాయవాదుల సహకార సంఘం డైరెక్టర్‌గా సంజీవరెడ్డి



సంజీవరెడ్డిని సన్మానిస్తున్న సహచర న్యాయవాదులు

దుబ్బాక: న్యాయవాదుల పరస్పర సహకార సంఘం ఉమ్మడి మెదక్ జిల్లా డైరెక్టర్‌గా దుబ్బాక బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మరిపెద్ది సంజీవరెడ్డి ఎన్నికయ్యారు. ఈ పదవిలో ఆయన మూడేళ్ల పాటు కొనసాగుతారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో డైరెక్టర్‌గా ఎన్నుకోవడంపై సహచర న్యాయవాదులకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. న్యాయవాదుల సంక్షేమం కోసం అహర్నిషలు కృషి చేస్తానని తెలిపారు.

ఫెయిలైన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

డీఐఈఓ రవీందర్‌రెడ్డి

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకి ప్రభుత్వ జూనియర్ కళాశాలను సిద్దిపేట డీఐఈఓ రవీందర్‌రెడ్డి శనివారం సందర్శించారు. అధ్యాపకులతో సమావేశం నిర్వహించి ఫెయిలైన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షలలో ఉత్తీర్ణత సాధించేలా చూడాలన్నారు. విద్యార్థుల సంఖ్య పెంచేందుకు గ్రామాలకు వెళ్లి 10 పాసైన విద్యార్థులను, తల్లిదండ్రులను కలువాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు చంద్రశేఖర్, సరిత, ప్రవీణ్‌రెడ్డి, సంజీవ్, శేషశయన తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలి



పరేడ్‌ను పరిశీలిస్తున్న డీసీపీ సుభాష్ చంద్రబోస్

చిన్నకోడూరు(సిద్దిపేట): క్రమ శిక్షణకు మారు పేరు పోలీస్ శాఖ అని, ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతోపాటు విధులు నిర్వర్తించాలని ఏఆర్ అదనపు డీసీపీ సుభాష్ చంద్రబోస్ అన్నారు. శనివారం మండల పరిధిలోని పెద్దకోడూరు శివారులోని సీఏఆర్ హెడ్ క్వార్టర్స్‌లో జిల్లాలోని సివిల్, రిజర్వ్ పోలీస్, హోంగార్డు సిబ్బందికి పరేడ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ సిబ్బంది క్రమం తప్పకుండా వాకింగ్, రన్నింగ్, యోగా వంటివి చేసి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. చెడు వ్యసనాలకు అలవాటు పడి విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే పోలీస్ శాఖ ప్రతిష్టకు భంగం కలిగించే వారవుతారన్నారు. ఈ కార్యక్రమంలో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్‌లు, ఆర్ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

మతం ముసుగులో దాడులు చేయొద్దు

ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య

చేర్యాల(సిద్దిపేట): దళితులపై మతం ముసుగులో దాడులకు దిగడం సరైనదికాదని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. మండల పరిధిలోని వేచరేణిలో దళిత యువకుడిపై దాడిజరిగిన విషయంపై శనివారం గ్రామానికి వచ్చిన ఆయన ఘటనపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మతం ముసుగులో దాడులకు పాల్పడటం సిగ్గుచేటన్నారు. దాడికి పాల్పడిన వారిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని పోలీసులకు సూచించారు. ఆయన వెంట దళిత సంఘాల నాయకులు తదితరులున్నారు.

పూలబాట..



దర్గాబందారం గ్రామం వెళ్లే రోడ్డు



హైదరాబాద్-కరీంనగర్ హైవే..

వేసవి కాలంలో చెట్లు ఆకులు రాల్చి కొత్త చిగురు తొడిగే సమయం. కొన్ని జాతులకు సంబంధించిన వృక్షాలు నూతన పుష్పాలతో చూపరులను ఆకర్షిస్తున్నాయి. సిద్దిపేట పట్టణ శివారులోని హైదరాబాద్-కరీంనగర్ హైవే రోడ్డు, కొండపాక మండలం దర్గాబందారం గ్రామం వెళ్లే దారంతా ఎరుపు రంగు పూలతో కనువిందు చేస్తున్నాయి. రాజీవ్ రహదారి వెంట నాటిన చెట్లు ప్రయాణికులను ఆహ్వానిస్తున్నట్లుగా పులకింపజేస్తున్నాయి. – సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సిద్దిపేట


సవరణలు.. చేతివాటం

- తొలుత ఇంటి పన్ను పెంచుతూ నోటీసులు
- సిద్దిపేట మున్సిపాలిటీలో ఇష్టారాజ్యంగా పన్ను తగ్గింపు
- పురపాలక ఆదాయానికి గండి
- ఉన్నతాధికారులు దృష్టి పెట్టాలి



ఈ ఫొటోలో కనిపిస్తున్నది సిద్దిపేట పట్టణంలో హైదరాబాద్ రోడ్‌లోని గెస్ట్ హోటల్‌కు 884 చదరపు గజాలకు రూ.11లక్షల 61వేల 666 ఇంటి పన్ను విధిస్తూ సవరించారు. తర్వాత ఫిబ్రవరి 5న అదే బహుల అంతస్తు భవనానికి 1,716.3 చదరపు గజాలకు రూ.4లక్షల 9439కు కుదించారు. ఏకంగా రూ.7లక్షల 52వేల 227లను తగ్గించారు. నివాస గృహం అని అనుమతి తీసుకొని కమర్షియల్ భవనంగా వినియోగిస్తున్నారు. ఇలా అనుమతి లేకుండా కమర్షియల్‌గా వినియోగిస్తుండటంతో తొలుత పన్ను పెంచారు. తర్వాత ఇంటి పన్ను తగ్గించడంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

సిద్దిపేట పట్టణంలో హౌసింగ్ బోర్డు కాలనీ ఆంజనేయ స్వామి దేవాలయం సమీపంలో నాలుగు అంతస్తుల కమర్షియల్ భవనానికి ఇంటి పన్ను కేవలం రూ.40వేలు మాత్రమే పన్ను వసూలు చేస్తున్నారు. కానీ భవనానికి దాదాపు రూ.లక్ష వరకు పన్ను వసూలు చేయాలని తెలుస్తోంది. ఇలా ఒక్క ఇంటికే కాదు చాలా గృహాలకు ఇదే విధంగా తక్కువ పన్ను వసూలు చేస్తూ మున్సిపల్ ఆదాయానికి గండి కొడుతున్నారు.



సిద్దిపేట పట్టణం వ్యూ

హైదరాబాద్ రోడ్‌లో నివాస గృహాలే..

సిద్దిపేట పట్టణం మైత్రీవనంలోని హైదరాబాద్ రోడ్‌లో చాలా కమర్షియల్ భవనాలు ఉన్నాయి. ఆ భవనాలు అన్ని నివాస గృహాలకే మున్సిపల్ నుంచి అనుమతులు తీసుకుంటున్నారు. ప్రధాన రహదారి కావడంతో కమర్షియల్ భవనాలుగా కొనసాగుతున్నాయి. వాటికి ఇంటి పన్నులో 50శాతం మాత్రమే పెంచి పన్ను వసూలు చేస్తున్నారు. అదే వాణిజ్య భవనాలుగా గుర్తిస్తే మరింత ఆదాయం రానుంది.

విచారణ చేస్తాం

“ సిద్దిపేట మున్సిపాలిటీలో ఇంటి పన్నుల తగ్గింపుపై విచారణ చేస్తాం. సవరణ చేసి వాటిని తిరిగి పరిశీలించి అవకతవకలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటాం.

– షాహెద్ మసూద్, ఆర్డీ, మున్సిపల్ శాఖ

సాక్షి, సిద్దిపేట: మున్సిపాలిటీల్లో ఇంటి పన్ను సవరణలో మున్సిపల్ అధికారులు తమ చేతివాటం ప్రదర్శిస్తున్నారు. ఇంటి పన్ను ఎంత ఉన్నా.. జేబు తడిపితే చాలు ఇష్టారాజ్యంగా ఇంటి పన్నును ఇట్టే తగ్గిస్తున్నారు. పన్నులను సవరణ చేసి మున్సిపల్ ఆదాయం పెంచకుండా అధికారులు వారి ఆదాయం పెంచుకుంటున్నారు. దీనిలో కింది స్థాయి నుంచి ఉన్నతాధికారుల వరకు హస్తం ఉన్నట్లు తెలుస్తోంది. పెద్ద భవనాలకు తక్కువ ఇంటి పన్నులు వసూలు చేస్తున్నారని సమాచారం. పురపాలికలకు ప్రధాన ఆదాయ వనరుగా ఉన్న ఆస్తి పన్ను నిర్ధారింపులో అక్రమాలు చోటు చేసుకుంటుండటంతో ఆదాయానికి గండి పడుతోంది.

తొలుత ఇంటి పన్ను పెంచుతూ నోటీసులు

పన్ను సవరణ చేసి మున్సిపల్ కార్యాలయం నుంచి నోటీసులు ఇంటి యజమానికి తొలుత అందజేస్తున్నారు. ఆ నోటీసులు అందుకున్న యజమాని వెంటనే అధికారులను సంప్రదిస్తున్నారు. సదరు అధికారి డబ్బులు ఇస్తే ఇంటి పన్నును తగ్గిస్తామంటూ ఆశ చూపుతున్నారు. ఒక్కసారి కొంత డబ్బు ఇస్తే కొన్నేళ్ల వరకు పన్నుకు సంబంధించిన డబ్బులు మిగులుతాయి కదా అని సదరు అధికారి అడిగిన డబ్బులను ఇస్తున్నారు. ఇలా పలువురు అధికారులు కాసులకు కక్కుర్తి పడుతుండటంతో మున్సిపల్ ఆదాయానికి గండి పడుతోంది. ఈ పన్ను తగ్గింపులో కింది స్థాయి నుంచి ఉన్నతాధికారుల వరకు హస్తం ఉన్నట్లు తెలుస్తోంది.

మున్సిపల్ ఆదాయం పెంచాలి

సిద్దిపేట మున్సిపాలిటీ పాలకవర్గం సర్వసభ్య సమావేశం ఇటీవల జరిగింది. ఆ సమావేశంలో ఇంటి పన్నులు సవరణ పేరుతో ఇష్టారాజ్యంగా పన్నులు తగ్గిస్తున్నారని ఓ కౌన్సిలర్ ఆరోపించారు. పట్టణాల అభివృద్ధి, కాలనీల్లో మౌలిక వసతుల కల్పన తదితర వాటికి ఆదాయం తప్పనిసరి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అధికారుల చేతి వాటానికి చెక్ పెట్టి మున్సిపల్ ఆదాయం పెరిగేందుకు కృషి చేయాల్సిన అవసరం ఉందని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

సకాలంలో పరీక్షా కేంద్రాలకు రావాలి

- జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్
- నీట్ పరీక్ష కేంద్రాల పరిశీలన



అధికారులకు సూచనలు చేస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): నీట్ పరీక్ష రాసే విద్యార్థులు నిర్ణీత సమయానికి పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ సూచించారు. శనివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్),బాలికల ఉన్నత పాఠశాలలోని నీట్ పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ పరికరాలు, మొబైల్ ఫోన్లు పరీక్ష హాలుకు తీసుకురావొద్దన్నారు. విద్యార్థులు హాల్ టికెట్‌తో పాటు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, ఆధార్ కార్డ్, పాన్ కార్డ్ తదితర ఏదేని ఒక గుర్తింపు కార్డును తీసుకొని రావాలని తెలిపారు. పరీక్ష మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించనున్నట్లు చెప్పారు. విద్యార్థులను ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు మాత్రమే అనుమతిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ సుభాష్ చంద్రబోస్, నీట్ పరీక్ష సిటీ కోఆర్డినేటర్ సూర్య ప్రకాశ్, పరీక్ష నిర్వహణ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలులో జాప్యం వద్దు

సిద్దిపేటఅర్బన్: అకాల వర్షాల నేపథ్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని వెంటనే తేమ శాతాన్ని కొలిచి తూకం వేసి మిల్లులకు పంపించాలని అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ సూచించారు. శనివారం సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాలలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు. అదనపు కలెక్టర్ వెంట అర్బన్ తహసీల్దార్ సలీం, మండల వ్యవసాయాధికారి శ్రీనాథ్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్, ఉన్నారు.

అప్పుల బాధతో యువకుడి ఆత్మహత్య

సిద్దిపేటకమాన్: అప్పుల బాధ భరించలేక యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన సిద్దిపేట పట్టణంలో చోటు చేసుకుంది. వన్ టౌన్ పోలీసుల కథనం ప్రకారం... తొగుట మండలం బండారుపల్లికి చెందిన మారెడ్డి సుధీర్‌రెడ్డి (32) హోటల్ నిర్వహిస్తూ పట్టణంలోని టీచర్స్ కాలనీలో ఉంటున్నాడు. హోటల్ కోసం అప్పు చేయగా సరిగా నడవక పోవడంతో మూతపడింది. అప్పులు తీర్చే మార్గం లేక ఆత్మహత్య చేసుకుంటున్నట్లు భార్యకు మెసేజ్ చేశాడు. భార్య ఇంటికి వచ్చి చూసే సరికి ఫ్యాన్‌కు ఉరి వేసుకొని మృతి చెంది ఉన్నాడు. కేసు దర్యాప్తులో ఉంది.

మంత్రిపై విమర్శలు సరికాదు

గ్రంథాలయ సంస్థ చైర్మన్ లింగమూర్తి



మాట్లాడుతున్న గ్రంథాలయ సంస్థ చైర్మన్ లింగమూర్తి

హుస్నాబాద్: వెనుకబడిన హుస్నాబాద్‌ను అభివృద్ధి చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్‌ను విమర్శిస్తే సహించేది లేదని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి అన్నారు. హుస్నాబాద్‌కు ఇంజినీరింగ్ కళాశాల మంజూరైతే కరీంనగర్ కాంగ్రెస్ నాయకులకు కడుపు నొప్పి ఎందుకని ఆయన ప్రశ్నించారు. శనివారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో స్థానిక నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల కరీంనగర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పురమల్ల శ్రీనివాస్ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను విమర్శించారన్నారు. గతంలో కరీంనగర్‌కు వచ్చిన కళాశాలలను అప్పటి మంత్రులు జీవన్ రెడ్డి, శ్రీధర్‌బాబు కొండగట్టు, మంథని ప్రాంతాలకు తీసుకెళితే పొన్నం వ్యతిరేకించలేదన్నారు. త్వరలో శ్రీనివాస్‌పై టీ పీసీసీ అధ్యక్షుడికి ఫిర్యాదు చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు రవీందర్, ఎండీ హుస్సేన్, శ్రీనివాస్, భిక్యా నాయక్, కిష్టస్వామి, వీరన్న పాల్గొన్నారు.

పిల్లలను ప్రోత్సహించేందుకే శిక్షణ శిబిరాలు

- సిద్దిపేట మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల
- సాక్షి, అంబిటస్ పాఠశాల ఆధ్వర్యంలో..
- ఉచిత వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం



డ్యాన్స్ ప్రాక్టీస్ చేస్తున్న చిన్నారులు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల

సిద్దిపేటకమాన్: వేసవి సెలవుల్లో శిక్షణ శిబిరాలు చిన్నారులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని సిద్దిపేట మున్సిపల్ చైర్‌పర్సన్ కడవెర్గు మంజుల రాజనర్సు అన్నారు. శనివారం సాక్షి, అంబిటస్ పాఠశాల సంయుక్త ఆధ్వర్యంలో పట్టణంలోని అంబిటస్ పాఠశాలలో ఉచిత వేసవి శిక్షణ శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఆమె హాజరై, అంబిటస్ పాఠశాల కరస్పాండెంట్ ఎడ్ల శ్రీనివాస్‌రెడ్డితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులతో ముచ్చటించి, భవిష్యత్‌లో వారు ఏమి కావాలనుకుంటున్నారో అడిగి తెలుసుకున్నారు. శిక్షణ శిబిరంలో కరాటే, యోగా, మ్యూజిక్, హ్యాండ్ రైటింగ్, డ్యాన్స్, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్‌లను ప్రారంభించారు. అనంతరం మున్సిపల్ చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. వేసవి సెలవుల్లో పిల్లలు బయట తిరగడం వల్ల వడదెబ్బ భారిన పడి అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉందన్నారు. పలు అంశాలపై శిక్షణ ఇవ్వడం వల్ల విద్యార్థుల్లో నైపుణ్యం పెరుగుతుందని తెలిపారు. వేసవి సెలవుల్లో సమయం వృథా చేయకుండా ఏదో ఒక అంశంపై పట్టు సాధించాలన్నారు. 15రోజుల పాటు ఉదయం 8.30 నుంచి 10.30 గంటల వరకు విద్యార్థులకు శిక్షణ ఇస్తారని తెలిపారు. ఉచిత వేసవి శిబిరాన్ని నిర్వహిస్తున్న సాక్షి మీడియా, అంబిటస్ పాఠశాల యాజమాన్యాన్ని ఆమె అభినందించారు. సుమారు వంద మంది పైగా విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో పవన్ రెడ్డి, డ్యాన్స్ మాస్టర్ వాసుదేవ్, కరాటే మాస్టర్ భాగ్యరాజ్, చిన్నా, టీచర్లు అపర్ణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కరాటే క్లాసులను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల, శ్రీనివాస్‌రెడ్డి

ధాన్యం తరలింపులో ఇబ్బందులుండొద్దు



మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

- మంత్రి పొన్నం ప్రభాకర్
- రూ.9 కోట్లతో ఎల్లమ్మ ఆలయం అభివృద్ధికి ప్రతిపాదనలు

కోహెడరూరల్(హుస్నాబాద్)/హుస్నాబాద్: ధాన్యం తరలింపులో వాహనాల ఇబ్బంది లేకుండా చూడాలని అధికారులను మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. శనివారం కోహెడ మండలంలోని శనిగరం గ్రామంలో అధునాతన పాడి క్లీనర్ అండ్ డ్రయ్యర్ యంత్రాన్ని మంత్రి ప్రారంభించారు. అలాగే శ్రీ రేణుకా ఎల్లమ్మ దేవాలయం , పోచమ్మ దేవాలయాల జాతర ఉత్సవాలపై అధికారుల సమీక్షలో ఆయన పాల్గొని మాట్లాడారు. రూ.180కోట్లతో మండలంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ పనులు ప్రారంభం కానున్నాయన్నారు. శనిగరం గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం కావాలని అడిగారని, త్వరలో కల్పిస్తామన్నారు. రేణుకా ఎల్లమ్మ, పోచమ్మ దేవాలయాలను స్థపతి ప్రకారమే అభివృద్ధి చేస్తామని మంత్రి అన్నారు. ఈ నెల 12 నుంచి జూన్ 11 వరకు జరిగే జాతరకు ఏర్పా ట్లు చేయాలన్నారు. ఆలయ అభివృద్ధికి రూ.9 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. మల్లె చెట్టు చౌరస్తా నుంచి ఎల్లమ్మ చెరువు మత్తడి వరకు రోడ్డు నిర్మాణానికి రూ.5కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ మను చౌదరి, ఆర్డీఓ రామ్మూర్తి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ లింగమూర్తి, సింగిల్ విండో చైర్మన్ శివయ్య, తహసీల్దార్ రవీందర్ రెడ్డి ఉన్నారు.

పోలీసులకు అండగా భద్రత స్కీమ్



కానిస్టేబుల్ కుటుంబ సభ్యులకు చెక్కును అందజేస్తున్న సీపీ అనురాధ

సిద్దిపేటకమాన్: విధి నిర్వహణలో మృతి చెందిన పోలీసులకు డిపార్ట్‌మెంట్ ఎప్పుడూ అండగా ఉంటుందని సీపీ అనురాధ అన్నారు. అనారోగ్యంతో మృతి చెందిన ఏఆర్ కానిస్టేబుల్ డీవీఆర్ రాజుకు డిపార్ట్‌మెంట్ నుంచి వచ్చిన రూ.8లక్షల చెక్కును ఆయన కుటుంబ సభ్యులకు సీపీ శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోలీ సు కుటుంబాలు ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి అండగా భద్రత స్కీమ్ ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో టాస్క్ ఫోర్స్ ఏసీపీ రవీందర్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్‌గౌడ్, పోలీసు సంఘం ఉపాధ్యక్షు డు రవీందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

భూ భారతిపైనే రైతుల ఆశలు

- సాదాబైనామాలు, అసైన్డ్ భూముల కేసులే అధికం
- పైలట్ ప్రాజెక్టుగా 'అక్కన్నపేట' ఎంపిక
- హర్షం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు



వివరాలు వెల్లడిస్తున్న తహసీల్దార్ అనంతరెడ్డి



పైలట్ ప్రాజెక్టుగా ఎంపికైన అక్కన్నపేట మండల తహసీల్దార్ కార్యాలయం

అక్కన్నపేట(హుస్నాబాద్): రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన భూ భారతి రెవెన్యూ చట్టాన్ని పైలట్ ప్రాజెక్టుగా 'అక్కన్నపేట మండలాన్ని' ఎంపిక చేస్తూ శనివారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మండలంలో ఎలాంటి భూ సమస్యలు ఉన్నాయి? ఎన్ని ఫిర్యాదులు వస్తున్నాయి? వాటి పరిష్కారం ఏ విధంగా సాధ్యమవుతుందని లెక్కలు వేసుకొని చట్టం ద్వారా వాటిని పరిష్కరిస్తారు. ఆ తర్వాత భూ భారతి పోర్టల్‌లో కూడా వాటికి సంబంధించిన మాడ్యూల్స్‌ను సిద్ధం చేస్తారు. భవిష్యత్‌లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా పోర్టల్‌ను రాష్ట్ర వ్యాప్తంగా పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకువస్తారు. అయితే భూ భారతి పైలట్ ప్రాజెక్టు కింద అక్కన్నపేట మండలాన్ని ఎంపిక చేయడానికి తన వంతు కృషి చేసిన రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఈ ప్రాంత రైతులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ హర్షం వ్యక్తం చేస్తున్నారు. అలాగే ఎన్నో ఏళ్లుగా పరిష్కారం కాని భూ సమస్యలకు భూ భారతి ద్వారా పరిష్కారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. సాదాబైనామా, అసైన్డ్ భూముల సమస్యలే అధికంగా ఉన్నాయి.

షెడ్యూల్ వివరాలు

భూ భారతి చట్టం అమలుకు పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక కావడంతో తహసీల్దార్ అనంతరెడ్డి శనివారం విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 5 నుంచి 20వ తేదీ వరకు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అక్కన్నపేట, హుస్నాబాద్, కోహెడ మండలాల తహసీల్దార్లు బృందాలుగా ఏర్పడినట్లు తెలిపారు. ఈ బృందాల్లో మొదటి టీంలో అక్కన్నపేట తహసీల్దార్ అనంతరెడ్డి, రెండో టీంలో హుస్నాబాద్ తహసీల్దార్ జీ.రవీందర్‌రెడ్డి, మూడో టీంలో కోహెడ తహసీల్దార్ కె.సురేఖ ఉన్నారు.

క్లుప్తంగా

పర్యావరణ ఇంజినీర్ తొలగింపు

సిద్దిపేటజోన్: సిద్దిపేట మున్సిపాలిటీలో ఎన్విరాల్‌మెంట్ ఇంజినీర్‌గా పని చేస్తున్న దిలీప్‌రెడ్డిని తొలగిస్తూ మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ ఆదేశాలు జారీ చేశారు. స్వచ్ఛ సిద్దిపేట, గ్రీన్ సిద్దిపేట లక్ష్యంగా ఓ ప్రైవేట్ ఏజెన్సీ ద్వారా మున్సిపాలిటీలో పర్యావరణ ఇంజినీర్‌గా దిలీప్ రెడ్డి నియామకం అయ్యారు. కొంతకాలంగా విధులపట్ల నిర్లక్ష్యం, పలు ఆరోపణలు, కౌన్సిల్ తీర్మానం నేపథ్యంలో అతడిని తొలగిస్తూ, అందుకు సంబంధించి సుదర్శ ఏజెన్సీతో చేసుకున్న దిలీప్ నియామకం రద్దు చేస్తున్నట్లు వారికి లేఖ రాశారు.

మట్టి టిప్పర్లు పట్టివేత

ముగ్గురిపై కేసు నమోదు, రూ.15 వేలు జరిమానా

వట్‌పల్లి(అందోల్): అక్రమంగా మట్టి తరలిస్తున్న టిప్పర్ వాహనాలను వట్‌పల్లి పోలీసులు పట్టుకొని కేసు నమోదు చేసిన ఘటన శనివారం చోటు చేసుకుంది. జోగిపేట సీఐ అనిల్‌కుమార్ కథనం మేరకు.. శుక్రవారం అర్ధరాత్రి గుట్టుగా వట్‌పల్లి గ్రామ శివారులో నుంచి కొందరు టిప్పర్ వాహనాల ద్వారా రేణుక ఎల్లమ్మ ఆలయ సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న ఓ ఫంక్షన్‌హాలు నిర్మాణం కోసం మట్టిని తరలిస్తున్నారు. నమ్మదగిన సమాచారం మేరకు వట్‌పల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మట్టిని తరలిస్తున్న మూడు టిప్పర్ వాహనాలను స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. తహసీల్దార్ శ్రీనివాస్‌కు సమాచారం అందించి వారి సమక్షంలో వాహనాలకు ఒక్కొక్కదానికి రూ.5 వేల చొప్పున మూడింటికి రూ.15 వేలు జరిమానాలు విధించారు. టిప్పర్ వాహనాల డ్రైవర్లు జాన్సన్, మహ్మద్ మోసిన్, జీ.మల్లేశం పై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో యువతి ఆత్మహత్య

రెండు నెలల కిందటే వివాహం



యువతి మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ

చిన్నశంకరంపేట(మెదక్): వివాహమైన రెండు నెలలకే యువతి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన చిన్నశంకరంపేట మండలం అగ్రహారం గ్రామంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. చిన్నశంకరంపేట మండలం అగ్రహారం గ్రామానికి చెందిన వట్టెపు రాజయ్య కుమారుడు మహేశ్‌కు రెండు నెలల కిందట వెల్దుర్తి మండలం షేరిలా గ్రామానికి చెందిన పూజను ఇచ్చి వివాహం చేశారు. ఈ క్రమంలోనే యువతి అత్తింట్లో ఉ రేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. విషయం తెలుసుకున్న గ్రామస్తులు యువతి తల్లితండ్రులకు సమాచారం అందించారు. ఆగ్రహానికి గురైన యువతి బంధువులు అత్తింటిపై దాడికి పాల్పడ్డారు. దీంతో గ్రామంలో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొంది. అత్తింటి కుటుంబ సభ్యులు పరారీలో ఉన్నారు. చిన్నశంకరంపేట ఎస్ఐ నారాయణగౌడ్, రామాయంపేట సీఐ వెంకటరాజం గౌడ్ తమ సిబ్బందితో వచ్చి యువతి బంధువులను సముదాయించారు. అనంతరం మృతదేహాన్ని పరిశీలించారు.

నీ కడుపు సల్లగుండా..

- మండు వేసవిలో ప్రజల దాహాన్ని తీరుస్తున్న నిర్వాహకులు
- బస్టాండ్‌లు, రోడ్లు, ప్రధాన చౌరస్తాలు, రైతు బజార్లు, తదితర చోట్ల ఏర్పాటు
- స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో చాలా ఏళ్లుగా నిర్వహణ
- కుటుంబీకుల జ్ఞాపకార్థం, ప్రజాసేవకై మరికొందరు
- రూ.లక్షలు ఖర్చు పెట్టి మినరల్ వాటర్ అందజేత

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చలివేంద్రాలు



ప్రజలను వేసవి తాపం నుంచి గట్టెక్కించేందుకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చలివేంద్రాలు వెలిశాయి. పలు అవసరాల కోసం బయటకు వచ్చే సామాన్య ప్రజలు, ప్రయాణికులు, వాహనదారులు, పాదాచారుల దాహార్తిని తీర్చేందుకు ఆస్పత్రులు, బస్టాండ్లు, రైతు బజార్లు, మార్కెట్లు, పాఠశాలలు, షాపులు తదితర ప్రాంతాల్లో తాగునీటిని సరఫరా చేస్తున్నారు. ఇప్పుడు మాత్రమే కాదు.. చాలా ఏళ్లుగా నిర్వహిస్తున్న వారు ఎంతో మంది ఉన్నారు. మరికొందరు తమ కుటుంబీలకు జ్ఞాపకార్థం.. ఇంకొందరు ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతో సొంత ఖర్చులతో చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. వేసవి కాలం ముగిసే వరకు మూడు నెలల పాటు ప్రజలు మినరల్ వాటర్ అందజేయనున్నారు. మండు వేసవిలో ప్రజల దాహార్తి తీరుస్తున్న చలివేంద్రాలపై ఆదివారం సాక్షి ప్రత్యేక కథనం..

రోజూ 300 నుంచి 350 లీటర్లు

దుబ్బాకలో సివిల్ క్లబ్ ఆధ్వర్యంలో చలివేంద్రం



ఎర్రగుంట ప్రసాద్

దుబ్బాక: పట్టణంలోని తెలంగాణ తల్లి చౌరస్తాలో సివిల్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రతీ యేటా వేసవికాలంలో చలివేంద్రం ఏర్పాటు చేసి ప్రజల దాహార్తి తీరుస్తున్నారు. ప్రతిరోజూ 300 నుంచి 350 లీటర్ల చల్లని మినరల్ వాటర్‌ను అందిస్తూ 1,000 నుంచి 1,200 మందికి నీటిని అందిస్తున్నామని సివిల్ క్లబ్ అధ్యక్షుడు ఎర్రగుంట ప్రసాద్ సాక్షికి తెలిపారు. తమ వంతుగా సమాజానికి ఏదైనా చేయాలన్న సంకల్పంతో చలివేంద్రం ఏర్పాటు చేసి ప్రజలకు మంచినీరు అందిస్తున్నామన్నారు. తమ క్లబ్ సభ్యులు ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి సైతం దీనికి ప్రత్యేకంగా సహకరిస్తున్నారని తెలిపారు.



తెలంగాణతల్లి చౌరస్తాలో సివిల్‌క్లబ్ ఆధ్వర్యంలో..

ఆరేళ్లుగా బస్టాండ్ వద్ద ఏర్పాటు

సీఐటీయూ ఆధ్వర్యంలో చలివేంద్రం



గొడ్డుబర్ల భాస్కర్

దుబ్బాక: దుబ్బాక పట్టణంలో సీఐటీయూ ఆధ్వర్యంలో కొన్నేళ్లుగా అంబలి కేంద్రం తోపాటు చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. సీఐటీయూ జిల్లా కోశాధికారి గొడ్డు బర్ల భాస్కర్ ప్రత్యేక కృషితో మార్చిలో బస్టాండ్ వద్ద చలి వేంద్రంను ఏర్పాటు చేసి ప్రతి రోజూ వెయ్యిమందికి పైగా చల్లటి మినరల్ వాటర్ అందిస్తు దాహార్తి తీరుస్తున్నారు. ఆరేళ్లుగా ఏర్పాటు చేస్తున్నట్లు ఈ సందర్భంగా భాస్కర్ సాక్షితో తెలిపారు. మండుటెండలో ఎక్కడో సుదూరప్రాంతాలకు చెందిన వారు ఈ చలివేంద్రంలో చల్లని నీరు తాగి దాహార్తి తీర్చుకోవడం చూస్తుంటే చాలా సంతృప్తిగా అనిపిస్తుంది.



దుబ్బాకలో ఏర్పాటు చేసిన చలివేంద్రం

మెడికల్ షాపు ఎదుట సొంత ఖర్చుతో..

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ పట్టణానికి చెందిన రతన్ సరడా ఒక్కడే ఆరేళ్ల నుంచి చలి వేంద్రం ఏర్పాటు చేస్తున్నారు. పట్టణంలోని భవానీ మందిరం రోడ్డులో రద్దీ ఎక్కువగా ఉంటుంది. వేసవిలో ఈ ప్రాంతానికి వచ్చిన వారికి మంచి నీళ్లు అందించాలన్న ఉద్దేశ్యంతో తన మెడికల్ షాపు ఎదుట చలివేంద్రం ఏర్పాటు చేసి కూలింగ్ మినరల్ వాటర్ అందిస్తున్నట్లు తెలిపారు. రెండేళ్లుగా ప్రతీ ఆదివారం నగర సంకీర్తన నిర్వహిస్తున్నామని, అందుకని ఈ సంవత్సరం చలివేంద్రాన్ని నగర సంకీర్తన పేరు పెట్టామన్నారు. పరిస్థితుల బట్టి అవసరం మేరకు కూలింగ్ వాటర్ బాటిల్స్ ఏర్పాటు చేస్తామన్నారు.



రతన్ మెడికల్ షాపు ఎదుట చలివేంద్రం



పాలమాకుల బస్టాప్‌లో చలివేంద్రం

బాటసారుల దాహార్తి తీరుస్తూ ...

నంగునూరు(సిద్దిపేట): హన్మకొండ ప్రధాన రహదారిపై ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులను చూసిన వేంకటేశ్వర దేవాలయ కమిటీ సభ్యులు పాలమాకులలో 8 ఏళ్ల కిందట చలి వేంద్రాన్ని ఏర్పాటు చేశారు. గీతా మందిర దాతృత్వ సంస్థ ఆధ్వర్యంలో నాటి నుంచి నేటి వరకు ప్రతి యేటా 3 నెలల పాటు ఫిల్టర్ వాటర్ అందిస్తూ ప్రయాణికుల దాహార్తిని తీరుస్తున్నారు. స్థానిక బస్టాప్‌లో ఏర్పాటు చేసిన చలి వేంద్రాన్ని బాటసారులే కాకుండా స్థానికులు, వృద్ధులు వినియోగించుకుంటున్నారు.

జేఎస్‌ఆర్ ఔదార్యం.. చలివేంద్రం

ప్రతీ నెలా రూ.15 లక్షలు ఖర్చు పెట్టి ఏర్పాటు



జన్నపురెడ్డి సురేందర్ రెడ్డి

హుస్నాబాద్: వేసవిలో ప్రజల దాహాన్ని తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజల దాహార్తిని తీర్చుతున్నాడు హుస్నాబాద్ నియోజకవర్గానికి చెందిన జన్నపురెడ్డి సురేందర్ రెడ్డి. జేఎస్‌ఆర్ అన్న పేరిట 5 ఏళ్లుగా చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నాడు. హుస్నాబాద్ పట్టణంతోపాటుగా అక్కన్నపేట, కోహెడ, చిగురుమామిడి, సైదాపూర్, భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండల కేంద్రాలతోపాటుగా పెద్ద గ్రామాల్లో మొత్తం 19 చలి వేంద్ర కేంద్రాలను ఏర్పాటు చేశాడు. ప్రతీ చలివేంద్ర కేంద్రంలో వాటర్ ఫ్రిడ్జిని ఏర్పాటు చేసి ప్రజలకు కూల్ వాటర్‌ను అందిస్తున్నాడు. 24 గంటల పాటు కూల్ వాటర్‌ను అందుబాటులో ఉంచుతున్నారు. కరెంటు బిల్లు, వర్కర్లు, చలివేంద్రాల నిర్వాహణ దాదాపు ప్రతి నెలా రూ.15 లక్షలు ఖర్చు పెడుతున్నాడు.



వాటర్ ట్యాంకర్ ద్వారా చలి వేంద్రంలో నీటిని నింపుతున్న సిబ్బంది

ప్రజల దాహం తీర్చాలన్న ఉద్దేశంతోనే..

నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి

నర్సాపూర్: వేసవిలో పనుల నిమిత్తం గ్రామాల నుంచి నియోజకవర్గ కేంద్రమైన నర్సాపూర్‌కు వచ్చే ప్రజల దాహం తీర్చాలన్న లక్ష్యంతోనే చలివేంద్రం నిర్వహిస్తున్నామని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి తెలిపారు. తన భర్త దివంగత వాకిటి లక్ష్మారెడ్డి స్మారకార్థం వాకిటి లక్ష్మారెడ్డి మెమోరియల్ అండ్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో సుమారు 20 ఏళ్ల నుంచి స్థానిక చౌరస్తాలో వేసవి సీజన్‌లో చలివేంద్రం ఏర్పాటు చేస్తున్నామన్నారు. మూడు నెలల పాటు రోజుకు సుమారు 200 నుంచి 250 లీటర్ల చల్లటి నీళ్లు అందుబాటులో ఉంచుతామన్నారు. తన భర్త స్మారకార్థం చేపడుతున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా వేసవిలో చలివేంద్రం ఏర్పాటు చేసి పేద ప్రజల దాహం తీర్చడం సంతోషాన్నిస్తుందని తెలిపారు.



నీళ్లు పోస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

18 ఏళ్లుగా డీసీఎం డ్రైవర్స్, ఓనర్స్ ఆధ్వర్యంలో..



బాలికల ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఎదురుగా..

తూప్రాన్: పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ఎదురుగా డీసీఎం డ్రైవర్స్, ఓనర్స్ ఆధ్వర్యంలో 18 ఏళ్లుగా చలివేంద్రం ఏర్పాటు చేస్తున్నామని డ్రైవర్, ఓనర్స్ అసోసి యేషన్ అధ్యక్షుడు యాదగిరి తెలిపారు. ఉగాది పండుగ రోజున పచ్చడితో ప్రారంభించి మృగశిర వరకు కొనసాగిస్తామన్నారు. నిత్యం నాలుగు డ్రమ్ముల మినరల్ నీటిని (2 వేల లీటర్లు) ప్రజలు తాగుతారన్నారు. వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చడం చాలా సంతోషంగా ఉందని, అందరం కలిసి ప్రజల కోసం ఓ మంచి పని చేస్తున్నామన్న ఆనందం కలుగుతుందన్నారు.

కుటుంబ సమస్యలతో ఉరేసుకొని ఆత్మహత్య



యాదయ్య(ఫైల్)

పాపన్నపేట(మెదక్): ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండల పరిధిలోని నార్సింగిలో శనివారం చోటు చేసుకుంది. పాపన్నపేట ఎస్ఐ శ్రీనివాస్‌గౌడ్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన బోడ యాదయ్య(48) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కుటుంబ సమస్యలతో కొంత కాలంగా మద్యానికి బానిస కావడంతో ఇంట్లో గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో జీవితం పై విరక్తి చెంది యాదయ్య ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య కవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పాపన్నపేట ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు.

జహీరాబాద్‌లో యువకుడు

జహీరాబాద్ టౌన్: ఉరేసుకొని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన జహీరాబాద్ పట్టణంలోని శాంతినగర్‌లో చోటు చేసుకుంది. శాంతినగర్‌కు చెందిన చాకలి తుకారాం(30) కుటుంబ కలహాల కారణంగా శనివారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. జహీరాబాద్ టౌన్ ఎస్ఐ.కాశీనాథ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ మెడలో పుస్తెలతాడు చోరీకి యత్నం

దొంగను పట్టుకొని పోలీసులకు అప్పగించిన స్థానికులు

వట్‌పల్లి(అందోల్): మహిళ మెడలోంచి పుస్తెలతాడును లాక్కొని బైక్‌పై పారిపోతున్న ఓ వ్యక్తిని స్థానికులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. జోగిపేట ఎస్ఐ పాండు కథనం మేరకు.. జోగిపేట పట్టణానికి చెందిన మాల నిర్మల శనివారం ఉదయం అందోల్ మండలం సంగుపేట చౌరస్తా వద్ద నాందేడ్– అకోలా జాతీయ రహదారిపై కూతురు కోసం ఎదురుచూస్తూ నిలబడింది. అదే సమయంలో ఓ వ్యక్తి బైక్‌పై అటు వైపుగా వచ్చి మహిళను గొంతు నలిపి, కొట్టి మెడలో ఉన్న పుస్తెల తాడు తెంపుకొని పారిపోతుండగా గమనించిన స్థానికులు వెంటనే పట్టుకున్నారు. అనంతరం పోలీసులకు అప్పగించారు. నిందితుడు పుల్కల్ మండలం మిన్‌పూర్ గ్రామానికి చెందిన లస్కర్ సుభాష్‌గా గుర్తించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ కేసులో ఏడుగురు అరెస్టు

వివరాలు వెల్లడించిన హుస్నాబాద్ ఏసీపీ సతీష్

చేర్యాల(సిద్దిపేట): దళిత యువకుడిపై దాడి ఘటన విషయమై నమోదు చేసిన ఎస్సీ, ఎస్టీ కేసులో ఏడుగురిని అరెస్టు చేసినట్లు హుస్నాబాద్ ఏసీపీ సతీష్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. గతనెల 29న ఎల్లాదాస్‌నగర్‌కు చెందిన ఉబిది అజయ్ మద్యం తాగి అందరిని తిడుతూ గ్రామంలోని హనుమాన్ గుడి లోపలికి వెళ్లి విగ్రహాలను పగులగొట్టి, హనుమాన్ విగ్రహాన్ని కాళ్లతో తన్నినాడు. ఈ విషయమై ఎల్లాదాస్‌నగర్ గ్రామస్తులు కట్టెలతో అజయ్‌ను కొట్టారు. అదే రోజు సాయంత్రం సుమారు 6 గంటలకు కొమురవెల్లి గ్రామంతో పాటు వేచరేణి, చేర్యాలకు చెందిన కొందరు వ్యక్తులు వచ్చి హనుమాన్ విగ్రహాన్ని ఎందుకు ధ్వంసం చేశావు అంటూ అంగీ ప్యాంటు విప్పి హనుమాన్ గుడి వద్దకు తీసుకెళ్లి దాడికి పాల్పడ్డారు. ఈ విషయమై కొమురవెల్లి పోలీసులు ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారు. కేసులో నిందితులైన వారిలో శనివారం బైరి హరీశ్, పాశం భరత్‌కుమార్, ఎక్కలదేవి శ్రీనివాస్, మెరుగోజు వెంకటేశం, గొడుగు సాయి కుమార్, ఐతరాజు ఉదయ్ ప్రకాశ్, పడకంటి వినయ్‌కుమార్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. కేసు విచారణ కొనసాగుతుందని, మరి కొంత మంది నిందితులను త్వరలో అరెస్టు చేస్తామన్నారు. ఆయన వెంట చేర్యాల సీఐ ఎల్.శ్రీను, కొమురవెల్లి ఎస్ఐ రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

మృతదేహం లభ్యం

పటాన్‌చెరు టౌన్: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని కిష్టారెడ్డిపేటలోని పల్లె ప్రకృతి వనం చెట్ల మధ్యలో శనివారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వయస్సు 45 నుంచి 50 ఏళ్ల మధ్య ఉంటుందని, అనారోగ్యంతో మృతి చెంది ఉండొచ్చని భావిస్తున్నారు. మృతుడి బంధువులు ఉంటే అమీన్‌పూర్ పోలీసులను సంప్రదించాలన్నారు. మృతదేహాన్ని పటాన్‌చెరు ప్రభుత్వాస్పత్రికి తరలించామన్నారు.

మద్యం మత్తులో పోలీసులపై దాడి

ఐదుగురు యువకులపై కేసు



పోలీసులపై దాడికి పాల్పడుతున్న యువకులు

శివ్వంపేట(నర్సాపూర్): మద్యం మత్తులో యువకులు పోలీసులపై దాడికి పాల్పడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. శివ్వంపేట పోలీసులు తూప్రాన్– నర్సాపూర్ హైవే పై పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో శనివారం సాయంత్రం డ్రంకై న్ డ్రైవ్‌లో భాగంగా వాహనాల తనిఖీ చేపట్టారు. రెండు బైక్‌లపై ఐదుగురు యువకులు హెల్మెట్ లేకుండా నిర్లక్ష్యంగా మద్యం మత్తులో శివ్వంపేట వైపునకు వస్తుండగా పోలీసులు ఆపారు. మా బైక్‌లనే ఆపుతారా అని ఆ యువకులు పోలీసులను దూషిస్తూ దాడికి పాల్పడ్డారు. అనంతరం ఆ యువకులను పోలీస్‌స్టేషన్‌కు తరలించినప్పటికీ అక్కడ కూడా పోలీసులను దూషిస్తూ హల్‌చల్ చేశారు. పోలీసులపై దాడికి పాల్పడిన వారిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ మధుకర్‌రెడ్డి అన్నారు. దాడికి పాల్పడిన వ్యక్తులు బిజ్లీపూర్ గ్రామ శివారులో ఉన్న శ్రీవాస్ లైఫ్ సైన్స్ పరిశ్రమలో విధులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గోమారం గ్రామానికి చెందిన ఎండీ రషీద్, గుంటూరు ప్రాంతానికి చెందిన బానావాత్ సైదానాయక్, బుక్య భీమానాయక్, గగ్లోత్ గోపినాయక్, బనావాత్ నందునాయక్ గా గుర్తించినట్లు చెప్పారు.

వీడిన హత్య కేసు మిస్టరీ

మృతుడు యాదాద్రి జిల్లా గోపాల్‌పూర్ గ్రామ వాసిగా గుర్తింపు

ములుగు(గజ్వేల్): ములుగు మండలం బస్వాపూర్ శివారులో గుర్తు తెలియని యువకుడి హత్య మిస్టరీ వీడింది. మృతుడు యాదాద్రి భువనగిరి జిల్లా, తుర్కపల్లి మండలం గోపాల్‌పూర్ గ్రామానికి చెందిన దాచారం సాయి కుమార్(25)గా గుర్తించారు. మృతుడు పశువుల కాపరి అని ఇతను కానరాకుండా పోయినట్లు తుర్కపల్లి పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం మిస్సింగ్ కేసు నమోదైందని గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి, ములుగు ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు. తుర్కపల్లిలో మిస్సింగ్ కేసు నేపథ్యంలో గ్రామానికి చెందిన వ్యక్తులే ములుగు మండలం బస్వాపూర్‌లో ఈ ఘాతుకానికి వడిగట్టారని తదుపరి విచారణ తుర్కపల్లి పోలీసులు నిర్వహిస్తారని వివరించారు.

నకిలీ కార్డులను సృష్టిస్తున్న వ్యక్తిపై కేసు

దుబ్బాకటౌన్: కంప్యూటర్ టెక్నాలజీని ఉపయోగించి ఒరిజినల్ కార్డులను పోలిన నకిలీ ఆర్సీ, ఆధార్, పాన్ కార్డులను తయారు చేస్తున్న జీరాక్స్ సెంటర్ నిర్వాహకుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటన దుబ్బాక పట్టణంలో శనివారం చోటు చేసుకుంది. దుబ్బాక ఎస్సై గంగరాజు కథనం మేరకు.. దుబ్బాక పట్టణంలోని బాలాజీ జీరాక్స్ ఆన్‌లైన్ సర్వీస్ సెంటర్ నిర్వహిస్తున్న సిరిమల్లె వేణుగోపాల్ సులభంగా డబ్బులు సంపాదించాలని నిర్ణయించుకున్నాడు. కార్డు దారుల అవసరాలకు అనుగుణంగా జీరాక్స్ ఆర్సీలను చిప్ గల కార్డులపై ప్రింట్ చేసి ఒరిజినల్ కార్డులను పోలిన విధంగా నకిలీ కార్డులను తయారు చేస్తున్నాడు. దీంతోపాటు పాన్ కార్డులు, ఆధార్ కార్డులు, ఇతర గుర్తింపు కార్డులను కంప్యూటర్, కలర్ ప్రింటర్ సహాయంతో స్కాన్ చేసి, టెక్నాలజీ ఉపయోగించి నకిలీ కార్డులను ఒరిజినల్ కార్డులుగా తయారు చేస్తున్నాడు. కార్డుదారులు మోసపూరిత చర్యలకు పాల్పడే విధంగా ప్రోత్సహిస్తున్నాడు. విశ్వసనీయ సమాచార అందుకున్న సిద్దిపేట టాస్క్ ఫోర్స్, దుబ్బాక పోలీసులు శనివారం జీరాక్స్ సెంటర్ పై దాడి చేశారు. దుకాణంలో ఉన్న వివిధ నకిలీ కార్డులను, కంప్యూటర్, కలర్ ప్రింటర్‌ను స్వాధీనం చేసుకొని దుబ్బాక పోలీస్ స్టేషన్ కి తరలించారు. దుబ్బాక ఏఎస్ఐ సముదాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు సిరిమల్లె వేణుగోపాల్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

భయంతో వంతెనపై నుంచి దూకి వ్యక్తి మృతి



అనూప్ మృతదేహం

పెద్దశంకరంపేట(మెదక్): వంతెనపై నుంచి దూకడంతో వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన పెద్దశంకరంపేట పెద్ద చెరువు వంతెనపై చోటు చేసుకుంది. పేట శిక్షణా ఎస్ఐ అరవింద్ కథనం మేరకు.. అల్లాదుర్గం మండలం రాంపురం గ్రామానికి చెందిన బేగరి అనూప్ (30)కు భార్య, కూతురు ఉన్నారు. అనూప్ వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. శుక్రవారం రాత్రి పెద్దశంకరంపేట నుంచి రాంపురం వైపు బైక్‌పై వెళ్తున్నాడు. అతడి ముందు బైక్‌పై చిల్వెర గ్రామానికి చెందిన రాములు వెళ్తున్నాడు. వేగంగా వచ్చిన అనూప్ రాములు వాహనాన్ని ఢీకొట్టడంతో ఇద్దరూ కింద పడిపోయారు. ఢీకొట్టినందుకు తనను ఏమైనా అంటారేమో అని భయంతో అనూప్ వంతెన పక్కన రహదారి ఉందనుకొని చీకట్లో దూకేశాడు. ఈ క్రమంలో కిందపడిపోయి తీవ్ర గాయాలతో మృతి చెందాడు. మృతుడి భార్య లావణ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి

చేగుంట(తూప్రాన్): గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన మాసాయిపేట మండలం రామంతాపూర్ శేర్ పంజాబీ దాబా సమీపంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్ఐ చైతన్యకుమార్‌రెడ్డి కథనం మేరకు.. రాజస్థాన్ రాష్ట్రం అజ్మీర్ జిల్లా కౌడా గ్రామానికి చెందిన ప్రహల్లాద బగ్రియా(39) లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. లారీని పంజాబీ దాబా వద్ద పార్కింగ్ చేసి రోడ్డు దాటుతున్న క్రమంలో హైదరాబాద్ నుంచి నిజామాబాద్ వైపుకు వెళ్తున్న గుర్తు తెలియని కారు ఢీకొనగా ప్రహల్లాదకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు.

వాహనం ఢీకొని మహిళ

జహీరాబాద్ టౌన్: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మహిళ చికిత్స పొందుతూ మృతి చెందింది. జహీరాబాద్ టౌన్ పోలీసుల కథనం మేరకు.. మండలంలోని సత్వార్ గ్రామానికి చెందిన మేతరి కమలమ్మ(55) శుక్రవారం పట్టణంలోని లిక్కర్ కోర్టు సమీపంలో కాలినడకన వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన ఆమెను జహీరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కాశీనాథ్ తెలిపారు.

బైక్ ఢీకొన్న ప్రమాదంలో రైతు..



శ్రీనివాస్ (ఫైల్)

కొల్చారం(నర్సాపూర్): రోడ్డు ప్రమాదంలో గాయపడిన రైతు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని చిన్న ఘనాపూర్ గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన నాగం శ్రీనివాస్ (45) వరిగుంతం గ్రామ శివారులోని తన పొలం సమీపంలో గల రోడ్డు పక్కన ధాన్యాన్ని ఆరబెట్టాడు. బుధవారం సాయంత్రం ధాన్యం కుప్పల వద్ద టార్పాలిన్లను సరి చేస్తున్నాడు. ఇదే సమయంలో మెదక్ వైపు నుంచి బైక్ పై వస్తున్న ఓ వ్యక్తి శ్రీనివాస్‌ను ఢీ కొట్టాడు. తీవ్ర గాయాలైన అతడిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా అక్కడ మృతి చెందాడు. మృతుడికి భార్య అనిత, కుమారుడు ఉన్నారు.

స్నానానికి వెళ్లి యువకుడు

జిన్నారం (పటాన్‌చెరు): స్నానానికి వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో మునిగి యువకుడు మృతి చెందిన ఘటన గుమ్మడిదల పోలీస్ స్టేషన్ పరిధిలోని బొంతపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ మహేశ్వర్ రెడ్డి, బాధితుల కథనం మేరకు.. కామారెడ్డి జిల్లా బిక్కనూరుకు చెందిన మిరియాల శివ, అతడి తమ్ముడు ప్రసాద్ (20) రెండేళ్లుగా బొంతపల్లి గ్రామంలో చెత్తడబ్బాలు ఏరుకుంటూ జీవనాన్ని కొనసాగిస్తున్నారు. 1న కటింగ్ చేయించుకుంటానని వెళ్లి రాత్రి వరకు ఇంటికి తిరిగి రాలేదు. శనివారం ఉదయం 8 గంటలకు గ్రామ శివారులోని అల్కా చెరువులో ఓ వ్యక్తి మృతదేహం ఉందని స్థానికులు తెలిపారు. వెంటనే అక్కడికి వెళ్లి చూడగా ఒడ్డున ప్రసాద్ మృతదేహాన్ని గుర్తించారు. స్నానం చేసేందుకు బట్టలు మెట్లపై పెట్టి వెళ్లి ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందాడని తమ్ముడి మరణంలో ఎలాంటి అనుమానం లేదని పోలీసులకు తెలిపారు.